క్లుప్తంగా

హిందు శ్మశాన వాటికకు విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

చినగంజాం (పర్చూరు): పర్చూరు హిందు శ్మశాన వాటిక అభివృద్ధి కోసం స్థానిక దాతలు విరాళం అందించారు. పర్చూరుకు చెందిన దాత కోటా శ్రీనివాసరావు, ప్రసన్న దంపతులు రూ. 1.25 లక్షల నగదుని విరాళంగా అందించారు. కోటా ధనలక్ష్మి జ్ఞాపకార్థం నగదు అందించినట్లు ఆయన తెలిపారు. గురువారం శ్మశాన అభివృద్ధి కమిటీకి నగదుని అందించినట్లు శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఒగ్గిశెట్టి గోవిందరాజులు, తులసి శివ నాగేశ్వరరావు, రంగిశెట్టి ఆంజనేయులు, మంగళగిరి కోటేశ్వరరావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, కొమ్మాలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్టు



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

చీరాల: పట్టణంలో గురువారం మధ్యాహ్నం బలమైన ఈదురుగాలులు వీచాయి. బలమైన ఈదురు గాలులు వలన రోడ్డుపై దుమ్ము, ధూళితో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పాతచీరాల వద్ద గాలుల ప్రభావం వలన రహదారి పక్కన ఉన్న చెట్టు ఒక్కసారిగా రోడ్డుపై కూలింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న కారు త్రుటిలో తప్పించుకుంది. ఒక్క నిమిషం ఆలస్యమైతే పెద్ద ప్రమాదమే జరిగేది. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాత వెంకటేశ్వర్లు

మార్టూరు: స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం దాత నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన నిరక్షరాస్యుడు వయోవృద్ధుడు గత కొన్ని సంవత్సరాలుగా చిమటా వెంకటేశ్వర్లు పలు పాఠశాలలకు ఉచితంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా స్థానిక బొడ్డురాయి సెంటర్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 200 మందికి పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు . కార్యక్రమంలో హెచ్ఎం దుప్పలపూడి శ్రీనివాసరావు, అమ్మ ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

తండ్రీకొడుకులపై దాడి చేసినందుకు కేసు

మార్టూరు: పాత కక్షల అనే నేపథ్యంలో తండ్రీ కొడుకులపై నలుగురు దాడి చేసి గాయపరిచిన విషయమై స్థానిక పోలీసు స్టేషన్లో గురువారం కేసు నమోదు అయింది. ఏఎస్సై ఐ షేక్ సైదా వివరాల మేరకు.. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామానికి చెందిన తన్నీరు రామకృష్ణ అతని కుమారుడు సుజిత్ బుధవారం సాయంత్రం స్థానిక శివగంగా లారీ ఆఫీస్ వద్ద ఉండగా దున్న ఏసురత్నం, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఇద్దరిపై కత్తి, ఇనుప రాడ్లతో దాడి చేసి విక్షణారహితంగా దాడిచేశారు. స్థానికులు అడ్డుకొని రామకృష్ణ అతని కుమారుడిని రక్షించి మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితుడు రామకృష్ణ గురువారం పోలీసు స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదుపై దున్న ఏసురత్నం అతని స్నేహితులు షేక్ మదార్ వలి, వలీనా, రవి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గతేడాది ఆగస్టులో దున్న ఏసురత్నం పదిమంది వ్యక్తులతో కలిసి తన్నీరు రామకృష్ణపై దాడి చేసిన కేసులో ఇరువర్గాలు రాజీపడగా యేసురత్నం రామకృష్ణకు రూ.40 వేలు ఇచ్చేటట్లు అప్పట్లో ఒప్పందం జరిగింది. అందులో భాగంగా యేసురత్నం రూ.25 వేలు మాత్రమే రామకృష్ణకు ఇచ్చాడు. మిగిలిన డబ్బులు అడిగినందుకు యేసురత్నం రామకృష్ణ అతని కుమారుడిపై మరోసారి దాడి చేసినట్లు బాధితుల సమాచారం.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో విద్యుత్‌లైన్ల పునరుద్ధరణలో భాగంగా శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలనుంచి 9 గంటల వరకు రేణింగవరం రోడ్డు, నామ్ మెయిన్‌రోడ్డు, కొత్త దామావారిపాలెం, బంగ్లారోడ్, కాకానిపాలెం ప్రాంతాల్లో, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు దర్శిరోడ్డు ఉత్తరం, భవాని సెంటర్ నుంచి పెరికపాలెం వరకు అలాగే రామశాస్త్రి వీధి, మీనాక్షి రెస్టారెంట్ వెనుక ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదలకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రైనేజార్పణం.. !



గ్రామ పంచాయతీ ముందు అసంపూర్తిగా తీసి ఉంచిన కాల్వ



రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కాలువలో ఉన్న పైపులు

- వేటపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- రూ. 2 కోట్ల నిధులు మట్టి పాలు
- విజృంభిస్తున్న డెంగీ, మలేరియా జ్వరాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

వేటపాలెం: అంగట్లో అన్ని ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది వేటపాలెం పరిస్థితి. మండల ప్రధాన కేంద్రం వేటపాలెంలో మురుగు నీటి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మూడేళ్ల కిందట ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 3 కోట్లతో ప్రారంభించిన డ్రైనేజీ పనులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ కేవలం 50 శాతం పనులు పూర్తిచేసి వదిలేశాడు. దీంతో ప్రస్తుతం కోటి పైచిలుకు పెట్టి నిర్మించిన డ్రైనేజీల్లో నీరు పారుదల లేక ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలిచిపోయి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయి. రూ. 1.50 కోట్లు నిధులు నిర్మించిన డ్రైనేజీ కాలవలు ఎందుకు పనికి రాకుండా కొంత భాగం మట్టి నిండి పూడి పోగా మరి కొంత భాగం చెట్లు, పుట్టతో నిడి పాములకు ఆవాసాలుగా మారాయి. డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్డు వెంట తీసిన డ్రైనేజీ గుంతలకు ఇప్పటికీ అదేవిధంగా ఉన్నాయి. ఈ గుంతల్లో పశువులు, మనుషులు ప్రమాదవశాత్తు పడి ఆస్పత్రి పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఏడాది కిందట డ్రైనేజీ నిర్మాణం కోసం తీసిన భారీ గుంతలో పడి వ్యక్తి మృతి చెందాడు. వారం రోజుల కిందట పోలీస్ స్టేషన్ ముందు డ్రైనేజీ కోసం తీసిన గుంతలో పాడి పశుపడి అందులోని ఇనుప చువ్వలు గుచ్చుకొని తీవ్రగాయాల పాలైంది.

పర్సంటేజీలకే ప్రాధాన్యత..

మండల, గ్రామస్థాయి అధికారులు శాశ్వత ప్రాతిపదికన రూ. 3 కోట్ల నిదులతో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీని పట్టించుకోకుండా కేవలం పర్సంటేజీలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటీవల ఆరు నెల కిందట గ్రామంలో రూ. 5 లక్షల వ్యయంతో ఒక్కొక్కటి రూ. 25 వేల వ్యయంతో రోడ్ల పక్కన ఇంకుడు గుంతలు తీశారు. ఇవి నెల తిరక్క ముందే భారీ వర్షానికి నిడిపోయి వర్షం నీటితో దోమల ఆవాసాలుగా మారిపోయాయి.


పట్టిపీడిస్తున్న సీజనల్ వ్యాధులు..

కొన్నిరోజులు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్టాప్ డయేరియా'కార్యక్రమం కేవలం పత్రికల్లో, సోషల్ మీడియాలో తప్పా కార్యరూపం దాల్చలేదనేది స్పష్టం అవుతోంది. గ్రామంలో రోడ్డు పక్కన అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన మురుగు నీటి కాలవల్లో నీటి పారుదల లేక ఎక్కడ నీరు అక్కడే నిలిచి పోయింది. దీనితో అవి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. ప్రస్తుతం వర్షా కాలం పెరుగుతున్న సీజనల వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా జ్వరాలతో ప్రజలు ఆందోళన చెదుతున్నారు. ఇటీవ దేశాయిపేట పంచాయతీలో ఒక డెంగీ కేసు నమోదైయింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు అసంపూర్తిగా 50 శాతం పనులతో నిలిచిపోయిన డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

> **డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు..**
> రూ. 3 కోట్ల నిధులతో ప్రారంభిచిన డ్రైనేజీ నిర్మాణ పనులు ఏడాది నుంచి నిలిచి పోయాయి. కేవలం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. గ్రామ పంచాయతీ వద్ద నిధులు లేవు. అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం పనులను స్వచ్ఛభారత్ గ్రాంట్‌తో పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నాం.
> – రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి, వేటపాలెం



కూలేందుకు సిద్ధంగా ఉన్న గ్రామచావిడి భవనం



పెచ్చులూడి ఇనుపచువ్వలు బయటపడిన దృశ్యం

శిథిల భవనం.. భయం భయం

చీరాల టౌన్: రెవెన్యూ వ్యవస్థలో వీఆర్వోలు కీలకం . గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన ధ్రువీకరణలు, భూమి శిస్తు వసూళ్లు, తదితర రెవెన్యూ సమస్యలను గ్రామస్థాయిలో పరిష్కరించే అధికారులు వీఆర్వోలు. గతంలో వీఆర్వోలు సాయంత్రానికల్లా తమ విధులను నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు అప్పటి ప్రభుత్వాలు గ్రామ చావిడి భవనాలను నిర్మించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వీఆర్వోల కోసం ఎదురుచూపులు చూడకుండా ఉండేందుకు వీఆర్వోలను గ్రామచావిడిలో ఉండేలా పట్టణంలోని ఎంజీసీ మార్కెట్ సమీపంలో రూ.1 కోటి పైగా విలువ చేసే స్థలంలో గ్రామచావిడిని ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల క్రితం వరకు వీఆర్వోలు అందుబాటులో ఉండేవారు. అయితే ప్రస్తుతం గ్రామచావిడి భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. నిత్యం వందలాది మంది ప్రజలు, వస్త్ర వ్యాపారులు, జనసంచారం అధికంగా ఉంటే ఈ భవన పరిధిలో ప్రస్తుతం భయానక పరిస్థితిలు నెలకొన్నాయి. భవనం శ్లాబులు పెచ్చులూడి పడిపోవడంతో చావిడిలోని రికార్డులన్నింటిని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం ఈగ్రామచావిడి పురాతనం అయ్యింది. ఎప్పుడు కూలుతుందో. ఏ గోడ పడిపోతుందో తెలియక ప్రజలు భయ బ్రాంతులకు గురవుతున్నారు. ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాన్ని కూల్చి వేసి ప్రభుత్వం నిధులు కేటాయించి నూతన గ్రామచావిడి కార్యాలయాన్ని నిర్మించాలని ప్రజలు, వీఆర్వోలు కోరుతున్నారు. ఈవిషయమై చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డిని వివరణ కోరగా శిథిలావస్థకు చేరిన గ్రామచావిడి భవనంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. గ్రామ చావిడి భవనం పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. తగిన చర్యలు తీసుకోవాలని కోరాం. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వస్తే తగిన విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దాతల సాయం అభినందనీయం



సంయుక్తకు నగదు అందజేస్తున్న ఇన్నర్‌వీల్ మహిళా క్లబ్ సభ్యులు



ఆర్థిక సాయం అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీరాల రూరల్: దాతల సాయం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఐఐటీలో ఇంజినీరింగ్ సీటు సాధించిన విద్యార్థినికి దాతలు ఆర్థికి సాయం అందించారు. గురువారం ఇన్నర్‌వీల్ మహిళ్లా క్లబ్ జిల్లా ఎడిటర్ ఇస్లర్ల సుభాషిణి, డాక్టర్ బాబురావు దంపతులు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. భోగిరెడ్డి సంయుక్త అనే పేద విద్యార్థిని ఇంటర్ మీడియట్‌లో అత్యధికంగా 980 మార్కులు సాధించి ఐఐటీ పాట్నాలో ఇంజినీరింగ్ సీటు సంపాదించింది. కానీ అంతదూరం వెళ్లి చదివే ఆర్థిక స్థోమత ఆ విద్యార్థినికి లేకపోవడంతో విద్యార్థిని బంధువులు ఇన్నర్‌వీల్ మహిళా క్లబ్ సభ్యులను కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో స్పందించిన వారు సేవా దృక్పథంతో క్లబ్ సభ్యుల సమక్షంలో రోటరీ సామాజిక భవనంలో విద్యార్థినికి సాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు భాను కుమారి, లలిత, నళిని, ప్రేమ హాస్పటల్ అధినేత డాక్టర్ ఇస్తర్ల బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య అవసరాల నిమిత్తం ఆర్థిక సాయం..

చినగంజాం (పర్చూరు): అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి రోటరీ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. పర్చూరు మండలం అన్నంభోట్ల వారిపాలెం గ్రామంలో మానం శివరామప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ అధ్వర్యంలో దొడ్డా వెంకట్రావు విజ్ఞప్తి మేరకు రూ. 50 వేలు వైద్య అవసరాలకు అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పంబి సదానందరెడ్డి, నాగబైరు శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, సర్పంచ్ నెల్లూరి అనంతమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు



ముక్తేశ్వరంలో బెండ తోటనను పరిశీలిస్తున్న హెచ్‌వో

బల్లికురవ: రైతులు పంటలసాగులో మేలైన, నాణ్యత కలిగిన విత్తనాలు ఎంపికతో బిల్లు, విత్తన ప్యాకెట్టు భద్రపరుచుకోవాలని మార్టూరు ఉద్యానవన శాఖాధికారి బీ. హనుమంతనాయక్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రైతు నాగండ్ల పున్నయ్య పీహెచ్ఎస్ కంపెనీకి చెందిన నీరజ్ బెండ సాగును 40 సెంట్లలో చేపట్టారు. కాయలు వంకర్లు తిరగటం, గిడసబారటం, తెల్లగా ఉండటం పట్ల కల్తీ విత్తనాలతో నష్టపోయినట్లు ఉద్యానవన శాఖాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విత్తన ప్యాకెట్లు, బిల్లు, పంట పొలాన్ని, బెండకాయలను ఆయన పరిశీలించారు. కల్తీ విత్తనాలతో దిగుబడులు తగ్గి తాను నష్టపోయానని రైతు వివరించారు. జిల్లా అధికారులకు నివేదిస్తానని హెచ్‌వో వివరించారు.

పర్యావరణానికి పచ్చదనమే మూలం



మార్టూరులో మానవహారం ప్రదర్శిస్తున్న పాఠశాల విద్యార్థులు

మార్టూరు: మొక్కల పెంపకం ద్వారా పచ్చదనంతో కూడిన పర్యావరణమే మానవ మనుగడకు మూలమంటూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. గురువారం గ్రీన్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు పాఠశాల నుంచి పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించే ప్లకార్డులను ప్రదర్శిస్తూ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్లో మానవహారం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు గ్రీన్ ఇండియా మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులతో ప్రయోజనాలు

యద్దనపూడి: కౌలురైతులు తాము సాగు చేసే కౌలు భూములపైన కౌలుసాగు హక్కుదారుల పత్రాలను గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి పొందాలని వ్యవసాయాధికారి చల్లగుండ్ల ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలోని పూనూరు, యద్దనపూడి గ్రామాల్లో సీసీఆర్సీ హక్కు పత్రాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతులు సీసీఆర్సీ కార్డులు పొందటం ద్వారా తాము సాగుచేసే పంటలను ఈ-పంట నమోదు, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పంటల బీమా సౌకర్యం తమ పేరుపైనే నమోదు చేసుకోవటం వీలుపడుతుందన్నారు. కనుక ప్రతిరైతులు తమ సాగుభూములపై కౌలురైతు రైతుపంటల సాగుహక్కు పత్రాలన్ని తప్పనిసరిగా పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కారంచేడు: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని ఇవ్వొచ్చని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ అప్పారావు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఐకేపీ ఏపీఎం మధుసూదనరావు సహకారంతో నిర్వహించిన ఈ క్షేత్రస్థాయి అవగాహనలో జీవామృతం, కషాయాలు తయారు చేసుకోవడం, వాటిని వినియోగించే విధానం, వాటిని వాడటం వలన కలిగే ఉపయోగాలను తెలిపారు. ఒక సెంటు స్థలంలో కిచెన్ గార్డెన్, 15 సెంట్లలో ఏటీఎం మోడల్ (నిరంతరం ఆదాయం సమకూరుట)లపైన అవగాహన కల్పించారు. భూమిని సారవంతం చేయడానికి పచ్చిరొట్ట, నవధాన్యములు, జీవామృతాలు, కషాయాలు వినియోగించుకోవాలన్నారు. విత్తనశుద్ధి ప్రధానమన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు గర్నెపూడి సుధారాణి, సీసీలు ఇస్సాక్, అశోక్, వేణు, వీఓఏ సుమలత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిరీషా, అంజలి, రాఘవయ్య, రైతులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వినతి

చీరాల: చేనేతల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య గురువారం అమరావతి క్యాంపు కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఎకనామికల్లీ వీకర్స్ హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ మంత్రి సవితను కలిసి వినతిపత్రాన్ని అందించారు. చీరాల నియోజకవర్గంలో చేనేతలు అధికంగా ఉన్నారని, చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన స్థానిక చేనేత నాయకులు, టీడీపీ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు

మార్టూరు: జాతీయ రహదారిపై బైకును కారు ఢీకొట్టిన ఘటనలో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. మండలంలోని డేగరమూడి గ్రామానికి చెందిన అన్నం నరేంద్ర, అన్నం కాశేశ్వరరావులు మంగళవారం రాత్రి మార్టూరు నుంచి సరుకులు తీసుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామం సర్వీసు రోడ్డులో బయలుదేరారు. ఈ క్రమంలో చిలకలూరిపేట నుంచి మార్టూరు వైపు వస్తున్న ఓ కారు స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో వీరి బైకును అతివేగంతో ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు చిలకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాశేశ్వరరావును మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుంటూరు పోలీసులకు నరేంద్ర ఇచ్చిన సమాచారం మేరకు మార్టూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మహబూబ్ బాషా తెలిపారు.

వైద్యుల సూచనలు పాటిస్తే రోగాలకు దూరం

చీరాల టౌన్: సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీదేవి సూచించారు. మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో గురువారం ఈపూరుపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించి 42 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన ఆరోగ్య, అవగాహన సదస్సులో వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కాల్షియం ఎక్కువగా ఉండే రాగిజావ, ఖర్జూరం, పాలు, కోడిగుడ్లను ఆహారాన్ని తీసుకోవడం వలన కీళ్లనొప్పులు, నీరసం ఉండదన్నారు. కార్యక్రమంలో సూపవైజర్లు, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతి

చీరాల టౌన్: ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని శుక్రవారం ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహం వద్ద నిర్వహిస్తున్నామని ఆర్గనైజేషన్ అధ్యక్షుడు దామర్ల శ్రీకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. జయంతి వేడుకలకు నియోజకవర్గంలోని కోటయ్య అభిమానులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు సూచించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



బహుమతులు అందిస్తున్న అతిథులు

చినగంజాం (పర్చూరు): బ్యాంకుల జాతీయకరణ, సామాన్యులకు అందుబాటులో బ్యాంకు సేవల్లు అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ప్రముఖ రేడియో ఆర్టిస్ట్ పిన్నక సాంబయ్య తెలిపారు. గురువారం స్థానిక వైఆర్ హైస్కూల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఝాన్సీ లక్ష్మీబాయి గ్రూప్‌నకు మొదటి బహుమతి, అంబేడ్కర్ గ్రూప్‌కు ద్వితీయ బహుమతి, ఎంకే గాంధీ గ్రూపుకు తృతీయ బహుమతి లభించినట్లు ఆయన వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిలు ఈదర రాజశేఖర్ చేతుల మీదుగా బహుమతులను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి కవిత, డి లక్ష్మీప్రసన్న, డి కల్యాణి, డి రమాప్రియ, వై మంగాదేవి, ఎ శ్రీనివాసరావు, వై ప్రభాకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకపోతే భారీ జరిమానా

చీరాల రూరల్: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లేకపోతే కొత్త చట్టం ప్రకారం భారీ జరిమానా విధిస్తారని చీరాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గొరవ రమేష్‌బాబు సూచించారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలతో మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక వీఆర్ఎస్అండ్‌వైఆర్ఎన్ కాలేజి సెంటర్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కొత్త న్యాయ చట్టాలు, హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సదస్సులో న్యాయవాదులు ఎ. రామకృష్ణారెడ్డి, చైతన్య, సిఎల్‌వీ. మతిన్, పోలీసులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన



వివిధ ప్రాంతాల వేషధారణలో విద్యార్థినులు



కుంకలమర్రులో వేషధారణలో విద్యార్థులు

చీరాల అర్బన్: విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఏర్పరచుకోవాలని పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం బి.సాల్మన్‌రాజు అన్నారు. శిక్షా సప్తాహ కార్యక్రమాలలో భాగంగా గురువారం పాఠశాలలో సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అనే మన ప్రాథమిక సూత్రాన్ని అలవర్చుకోవాలన్నారు. వివిధ భాషలు, మతాలు, సంప్రదాయాలు, సంస్కృతులు కలిగిన భారతీయుల అందరూ ఒక్కటే అనే విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంకలమర్రు (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రతి ఒక్కరూ భిన్నత్వంలో ఏకత్వంలా కలసి, మెలసి జీవించాలని ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన మండలంలోని కుంలకమర్రు సీసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ కార్యక్రమాల్లో భాగంగా 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' అనేలా విద్యార్థులు ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్యామల, నాగమణి, బాబూరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక గుర్తింపు

చీరాల: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఆపార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్యం కలిగిన రాష్ట్రానికి పార్లమెంట్‌లో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. రూ.15 వేల కోట్లతో అమరావతి నిర్మాణానికి నిధులు అందిస్తామని కేంద్రం ముందుకు రావడం సంతోషకరమన్నారు. అలానే పోర్టులు, రహదారులు, కారిడార్ల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణారావు, అరవపల్లి కుమార్, చంద్రశేఖర్, మనోహర్, భవాని, జైశంకర్ తదితరులు పాల్గొన్నారు.